## 2026లో నంద్యాల అభివృద్ధికి సమిష్టి కృషి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 01-ఆంగ్ల నూతన సంవత్సరం 2026 సందర్భంగా నంద్యాల జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధికారులు కలెక్టర్ రాజకుమారి గణియాను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, తహశీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన సంవత్సరం 2026లో నంద్యాల జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన, సమర్థవంతమైన సేవల అందింపే ధ్యేయంగా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పేదలు, బలహీన వర్గాలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సేవల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తే నంద్యాల జిల్లా అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. 2026 సంవత్సరం జిల్లాకు సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కలిగిన సంవత్సరంగా నిలవాలని ఆకాంక్షించారు.

## జనసేన నేతల శుభాకాంక్షలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 01-2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మహనంది మండల జనసేన నాయకులు మారెడ్డి రామయ్య ఆధ్వర్యంలో జనసేన నాయకులు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డిని ఆత్మకూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుక్కాపురం జనసేన నాయకులు సుంకరి హరి, సంగా శివ, పుట్టుపల్లె జనసేన నాయకులు కొల్లి జైపాల్, కొల్లి దేవరాజు, దిమ్ము మధు, దిమ్ము అశోక్, మిద్దె ఖాదర్, కొల్లి రాహూల్ కలిసి ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జనసేన శ్రేణులు ప్రజాసేవకు కట్టుబడి పనిచేస్తాయని, నియోజకవర్గ అభివృద్ధిలో సమన్వయంతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

## అడవుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 01-అడవులను సంరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని నాగార్జున సాగర్ అభయారణ్య వన్యప్రాణి శాఖ ఫీల్డ్ డైరెక్టర్ విజయ్ కుమార్ అన్నారు. గురువారం మహానందిలోని అటవీ పర్యావరణ అవగాహన కేంద్రాన్ని ఆయన పునఃప్రారంభించారు. గతంలో స్థానిక ప్రజలకు, మహానందికి వచ్చే భక్తులకు అడవులు, వన్యప్రాణులపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన చిత్రీకరణలు నిధుల కొరత కారణంగా కొన్నేళ్లుగా మూతపడ్డాయి. విషయం తెలుసుకున్న ఫీల్డ్ డైరెక్టర్ ప్రత్యేక చొరవతో కేంద్రాన్ని మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలో ప్రస్తుతం 87 పెద్ద పులులు ఉన్నాయని తెలిపారు. త్వరలో పులుల లెక్కింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. సిబ్బందికి ఆయుధాల వినియోగంపై శిక్షణ అందిస్తామని, అయితే సిబ్బంది కొరత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డివిజనల్ ఫారెస్ట్ అధికారి అనురాగ్ మీనా, రేంజ్ అధికారులు నాజిర్ జా, ఉదయ్ దీప్, మహానంది డీఆర్ఓ హైమావతి తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ రోడ్డు భద్రతా మాసం ప్రారంభం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 01 :ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించినప్పుడే నిజమైన రోడ్డు భద్రత సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయ ఆవరణలో జాతీయ రోడ్డు భద్రతా మాసం?2026 బ్యానర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఇదే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ జిల్లా పోలీస్ కార్యాలయంలో రోడ్డు భద్రతా బ్యానర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలను విషాదంలోకి నెట్టుతున్నాయని అన్నారు. ఇది కేవలం గణాంకాల అంశం కాదని, సమాజంగా మనందరి బాధ్యతగా భావించి మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు, యువత, పాదచారులు ప్రమాదాలకు ఎక్కువగా గురవుతున్న నేపథ్యంలో రోడ్డు భద్రతపై సమగ్ర దృష్టి అవసరమని తెలిపారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరిగా ఉండాలని, మద్యం సేవించి వాహనం నడపరాదన్న అవగాహన ప్రతి ఒక్కరికి చేరాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఏ ఒన్ ఆధారిత కెమెరాలు, స్పీడ్ మానిటరింగ్ వ్యవస్థలు, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్ ద్వారా రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని వివరించారు. రోడ్డు భద్రత సాధనకు పోలీస్, ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలు, ఏపీఎస్ఆర్టీసీ, ఎన్ హెచ్ఏఐ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసం సందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల తగ్గింపే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టి జీరో ఫాటాలిటీ దిశగా ముందుకు సాగాలని కలెక్టర్, ఎస్పీలు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఉప రవాణా అధికారి శివారెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## 19.01.2026 నుండి 27.01.2026 వరకు సూర్య దేవాలయంలో శ్రీ రాజశ్యామల నవరాత్రులు నిర్వహణ..

విభారే న్యూస్ జనవరి 1 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో 19 -01 -2026 మాఘశుద్ధ పాడ్యమి సోమవారం నుండి 27 -01 -2026 మాఘశుద్ధ నవమి మంగళవారం పర్యంతము శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ మహా గౌరీ అమ్మవారికి శ్రీవిద్య సంప్రదాయానుసారం శ్రీ రాజశ్యామల నవరాత్రులు ( గుప్తనవరాత్రులు ) నిర్వహించబడును. ప్రతి రోజు శ్రీ రాజశ్యామల మూల మంత్ర అనుష్టానము అభిషేకం, శ్రీ రాజశ్యామల సహస్ర నామ, శ్రీ లలితా సహస్రనామ అర్చనలు, జరుగును. శ్రీ లలితా మహాత్రిపుర సుందరి దేవి యొక్క ప్రధాన మంత్రిణి శ్రీ రాజశ్యామలా దేవి గొప్ప సంమ్మోహన శక్తి ఈ అమ్మ అనుగ్రహం వలన ఉన్నత పదవీ, ఉద్యోగ, విద్యా, వ్యాపార, లాభాలు పొందవచ్చును. సకల దాంపత్య సమస్యలు, శత్రు, రుణ, రోగ, బాధలు, తొలగి ఆయురారోగ్య ఐశ్వర్యములు సిద్ధించును. శ్రీ రాజశ్యామల నవరాత్రుల ముగింపు సందర్భంగా 27 -01 -2026 ఉదయం 10:30 గంటలకు అంగ , ఉపాంగ ,ప్రత్యంగ దేవత మూల మంత్ర హోమ సహిత శ్రీ రాజశ్యామల మూల మంత్ర హోమయుత సహస్రనామ హోమం జరుగును సంకల్పం 9 రోజులకు:-300/-హోమం ప్రధానంగా : 4000 /-హోమ సంకల్పం : 116 / -సంప్రదించవలసిన నెంబరు. డి లక్ష్మీనరసింహాశర్మ 8008774086ఫోన్ పే గూగుల్ పే నెంబరు. 8896123777

## జిల్లా జడ్జి, కర్నూలు రేంజ్ డిఐజి లను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన డిఐజి విక్రాంత్ పాటిల్ ఐపియస్.

విభారే న్యూస్ జనవరి 1 కర్నూలు జిల్లా ప్రతినిధి..డీఐజి గా పదోన్నతి స్వీకరించిన విక్రాంత్ పాటిల్ ఐపియస్. అభినందనలు తెలిపిన జిల్లా జడ్జి,కర్నూల్ రేంజ్ డిఐజి. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ ఎస్పీ స్థాయి నుండి డీఐజీ గా ఈ రోజు పదోన్నతి స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా జడ్జి కబర్ధి ని , కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ ఐపియస్ లను డిఐజి విక్రాంత్ పాటిల్ ఐపియస్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీఐజీగా పదోన్నతి స్వీకరించిన విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ కి జిల్లా జడ్జి,కర్నూల్ రేంజ్ డిఐజి అభినందనలు తెలియజేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో విక్రాంత్ పాటిల్ ని అడిషనల్ ఎస్పీలు,డీఎస్పీలు, సిఐలు,ఆర్ ఐలు, ఎస్సైలు,ఆర్ ఎస్ ఐ లు, డిపిఓ మినిస్టిరియల్ సిబ్బంది,ఇతర శాఖల సిబ్బంది కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో డిఐజి విక్రాంత్ పాటిల్, కర్నూల్ ఏపీఎస్పీ 2 వ బెటాలియన్ కమాండెట్ దీపికా పాటిల్ ఐపిఎస్ కలిసి కుటుంబ సమేతంగా కేక్ కట్ చేసి స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి , క్యాంపు కార్యాలయంలోని సిబ్బందికి నూతన సంవత్సరనీ శుభాకాంక్షలు తెలిపారు.



## ఫెన్సింగ్‌లో చిన్మయి శ్రేయ సంచలనం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 01-నంద్యాల ముద్దుబిడ్డ, ఫెన్సింగ్ క్రీడాకారిణి పబ్బతి చిన్మయి శ్రేయ మరోసారి తన సత్తా చాటి సంచలనం సృష్టించింది. మహారాష్ట్రలో గత ఐదు రోజులుగా జరుగుతున్న 69వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ పోటీల్లో అండర్ 17 బాలికల విభాగంలో మూడో స్థానం సాధించి కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఫెన్సింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరఫున స్కూల్ గేమ్స్ స్థాయిలో ఇదే తొలి పతకం కావడం విశేషం. ఈ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా క్రీడా విభాగం తరఫున పాల్గొన్న చిన్మయి శ్రేయ, పశ్చిమ బెంగాల్ క్రీడాకారిణులపై గెలుపొందింది. అనంతరం గోవా, ఐబీఎస్ఎస్ఓ, తెలంగాణ రాష్ట్రాల క్రీడాకారిణులను మట్టికరిపించి మెడల్ రౌండ్‌కు చేరుకుంది. ఇదివరకే ఏషియన్ గేమ్స్ ఫెన్సింగ్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన రాయలసీమ తొలి క్రీడాకారిణిగా గుర్తింపు పొందిన చిన్మయి శ్రేయ, అంతర్జాతీయ స్థాయిలోనూ తన ప్రతిభను నిరూపించేందుకు సిద్ధమవుతోంది. ఈ ఘన విజయంతో నంద్యాల పేరును జాతీయ స్థాయిలో మరింత వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, క్రీడాకారులు చిన్మయి శ్రేయను ఘనంగా అభినందించారు.



## మహానందీశ్వరుడికి అన్నాభిషేకం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 01-ధనుర్మాస ప్రయుక్త వార్షిక ఆర్ద్రోత్సవాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం శ్రీ మహానందీశ్వర స్వామివారికి వైభవంగా అన్నాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రేపు 2 జనవరి 2026 శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి శనివారం తెల్లవారుజామున 3 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్ నివాసులు వారణాసి రామ్మోహన్ రావు విజయలక్ష్మి దంపతుల సహకారంతో అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదం పంపిణీ చేస్తారు. శ్రీ మహానందీశ్వర స్వామివారికి జరిగే మహా ప్రభావవంతమైన అన్నాభిషేకాన్ని భక్తులు దర్శించుకుని తరించాలని ఆలయ అధికారులు కోరారు.


## జనసేన కార్యాలయంలో నూతన సంవత్సరం శుభాకాంక్షల సందడి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 01-నూతన సంవత్సరం సందర్భంగా ఆళ్లగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు ఆళ్లగడ్డ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్యను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొత్త ఏడాదిలో ప్రజలకు మరింత చేరువగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కూటమి సమిష్టిగా పనిచేస్తుందని తెలిపారు. మైలేరి మల్లయ్య మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులతో నూతన సంవత్సరంలో సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, ప్రజల నమ్మకాన్ని బలోపేతం చేసేలా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు సూర్యదేవాలయంలో పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతం..

విభారే న్యూస్ జనవరి 1 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీసూర్య నారాయణ స్వామి వారి దేవాలయంలో 03-01-2026, శనివారం, పౌర్ణమి సందర్భంగా శ్రీ రమా సహిత శ్రీ సత్య నారాయణ స్వామి వారి వ్రతములు అత్యంత వైభవోపేతంగా జరుగును. శ్రీ రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం, శ్రీమన్నారాయణ నుకి అత్యంత ప్రియమైనది. నూతన సంవత్సరం, స్వామి వారి వ్రతం తో ప్రారంభించి ఈ సంవత్సరం అంతా స్వామి వారి కృప తో తమ ఇష్ట కామ్యార్థాలను పొందగలరు. కావున భక్తులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని శ్రీ రమా సహిత శ్రీ సత్య నారాయణ స్వామి వారి కృప కు పాత్రులు కాగలరు. గమనిక :- ప్రధానంగా వ్రతం చేస్తున్న భక్తులు దయచేసి ఉదయం 8:30 గంటలకు దేవాలయం లో సిద్ధం గా ఉండగలరు. భక్తులు సంప్రదాయ దుస్తులతో రావాలని మనవి. వ్రతములో భక్తులు దయచేసి పూజారికి సహకరించగలరు. వ్రతం ప్రధానంగా - 1116/-వ్రత సంకల్పం - 116/-సంప్రదించండి :-శ్రీధర్ శర్మ -7995202082గూగుల్ పే నెంబరు. 8896123777ఆఫీసు ల్యాండ్ ఫోన్ నెంబరు..08518-234388



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**